# పుత్రవాత్సల్యం

డా. వి.వి. సుబ్బారావు



**కాలుతున్న చుట్ట, లోతైన కళ్ళు, ముడుతలు పడ్డ ముఖం అడక్కున్నా చెప్తాయి రామయ్య జీవితంలో పండిన అనుభవాల పరంపరలు. అంతేకాదు తోటకూర, గోంగూర ఆకుల నిగనగలలో రామయ్య గొంతు గలగలలు వినిపింపక తప్పవు మరి!**

గుప్పగుప్పన చుట్ట పొగ వదుల్తూ, ఆసాయం సంధ్యా సమయంలో రామయ్య తనలో తనే నవ్వుకుంటూ ఆకాశం వైపు చూస్తున్నాడు. గతం కళ్ళ ముందు పొరలు పొరలుగా కదులుతోంది.

ఇరవై ఏళ్లు నిండకుండా ముగ్గురు పిల్లల తండ్రి అయ్యాడు రామయ్య. ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగ పిల్లాడు – రామయ్యకి చాలా సార్లు అనిపించేది ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల అయితే ఎంత బాగుండేదో – ఏమన్నాకానీ, మగ పిల్లాడు, మగ పిల్లాడే.

రామయ్య పెద్దకూతురు సీత, చిన్నకూతురు లక్ష్మి కూడా తండ్రితోబాటు ఆకుకూరల వ్యాపారం చేస్తున్నారు. ఆ ఊర్లో అందరికీ రామయ్య అంటే తోటకూర రామయ్యే. ఓసారి రామయ్య పెద్దకూతురు సీతకు కోపమొచ్చింది. ‘ మానాన్నకి పేరు లేదా, తోటకూర రామయ్య అంటారే? అంది కోపంగా పక్కింటి రైతు వెంకటేశుతో.

‘ఏం, అలానే అంటాం........నువ్వు, నీ చెల్లి కూడా ఆకుకూరల పనేగా చేస్తున్నదీ......పిల్లా, నీకు కోపమొస్తే నాకేం, నిన్నూ తోటకూర సీతమ్మ అంటాను’ అన్నాడు నవ్వుతూ.

రామయ్య ఈ సంభాషణ వింటూ రామయ్య పిల్లల కేసి చూసాడు...ఐదో క్లాసు చదువుతున్న సీతని, మూడోక్లాసు చదువుతున్న లక్ష్మిని బడి మానిపించి, తనతో పనిలోకి తీసుకెడుతున్నాడు.........ఇంకో నాలుగేళ్లు ఇలా పనిలోకి తీసికెడితే, చినబాబు బడిలో కెళ్లటం మొదలెడతాడు.

బాబుని బడిలో వేస్తే ఎంత ఖర్చు.....పుస్తకాలనీ, బట్టలనీ, పెన్సిళ్లనీ – అబ్బో, పైగా ఇంగ్లీషు బడి – మరీ ఖరీదు – అయితేనేం, చినబాబుని మంచి బడిలో వేసి చదువు చెప్పించాలి – అంతే’ – రామయ్య ఇలా -అనుకుంటూండగానే సీత తోటకూర కట్టలు, గోంగూర కట్టలు కట్టి గంపనిండా నింపి బట్ట తడిపి, సిండి గంపపైన వేసింది.

‘మన సిద్దుని బడికి పంపేయాలమ్మా! మన మేష్టారి బడిలో వేద్దాం –’ అన్నాడు తోటకూర రామయ్య సీతతో. ‘మేష్టారి బడిలోనా..అంత డబ్బే – గవర్నమెంటు బడిలో అయితే ఖర్చు తక్కువ కదూ’

రామయ్య కస్సుమన్నాడు

ఆడపిల్లల మీద డబ్బు ఖర్చు చేయటం దండగని, నమ్ముతాడు రామయ్య. అంతేకాదు, మగపిల్లాడి పైన ఎన్నో ఆశలు పెట్టుకు పెంచుతూ, ఆ మగపిల్లాడే తనని కనిపెట్టుకు చూస్తాడని బాగా నమ్మకంతో మురిసిపోయే వాడు రామయ్య.

రామయ్య తోటకూర అమ్మి, ఇంటి కొచ్చి వీధి అరుగు మీద కూర్చున్నాడు.

‘తోటకూర రామయ్యా!, పిల్ల పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నావట!’

పక్కింటి మేష్టారి అరుగుమీద కూచుంటూ అన్నారు.

‘అవునండి.....పై నెలలో ముహుర్తాలు’ రామయ్య ముఖం నిండా సంతోషం నిండింది.

‘ఒక్కమాట విను, పద్దెనిమిది సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయటం నేరం తెలుసా” – మేష్టారు రామయ్య ముఖంలోకి చూసాడు.

తోటకూర రామయ్య ఫక్కున నవ్వాడు.

‘ఏంటి మేష్టారూ.......మాలాంటి బీదాళ్లకే ఈ రూల్సు అన్నీ – మొన్న మన ఊరి పెద్దయ్యగారు మనుమరాలు పదేళ్ల పిల్లకి పెళ్లి చేస్తే ఎవరేమన్నా అన్నారా? అని అటు ఇటు చూసి ‘చినబాబు ఉత్తరం రాసాడు......పెద్ద ఆఫీసరు పరీక్ష పాసయిపోయాడట. బాబూ.....వాడే నాకష్టాలు గట్టెక్కిస్తాడు. నాకు మంచి రోజులొచ్చాయి బాబు – ’ తోటకూర రామయ్య ఉత్సాహంగా మాట్లాడుతుంటే చిరునవ్వు నవ్వాడు రామం మేష్టారు.

కాలం పరిగెత్తింది. రామయ్య కూతుళ్లకి పెళ్లిళ్లు చేసి పంపేశాడు. తోటకూర రామయ్య కొడుకు సిద్ధు బాంకిలో పెద్ద పదవి సంపాదించాడు.

చిన్న ఇల్లు, ముసలి తండ్రి – చిరాకు కలిగిస్తున్నాయి సిద్ధుకి. రామయ్య తోటకూర వ్యాపారం కూడా నచ్చటం లేదు సిద్ధూకి.

పదిహేను రోజులు ఆలోచన చేసాడు సిద్ధూ. చుట్ట కాలుస్తూ వీధి అరుగు మీద కూచున్న తండ్రి దగ్గర కొచ్చాడు.

‘ఈ ఊరు నించి పట్నం వెళ్లాలనుకుంటున్నాను – అక్కడయితే నాకూ, మీ కోడలికీ బాగుంటుందనుకుంటున్నాము.......’ ఏదో నసుగుతున్నాడు సిద్ధూ.

‘మీ రెక్కడుంటే అక్కడే నేను – ’ తోటకూర రామయ్య కళ్లలో ఆనందం నిండిపోయింది.

సిద్ధు ముఖం వెలవెల బోయింది –

‘ఈ ముసలాడు తనకి తప్పదన్నమాట’ – సిద్ధూకి చాలా కోపం వచ్చింది.

‘మీ తోటకూర వ్యాపారం మానేస్తే ఎలా’ – అన్నాడు.

‘అంటే నేను బతికున్నంత కాలం పని చేయాలా? అక్కర్లేదు మానేస్తాను’ – చేతిలో చుట్ట విసిరి కొట్టేడు.

‘అదికాదు – పట్నంలో మీకు తోచదు – పైగా మీ అలవాట్లు అవి అక్కడ కష్టం’ –

‘అంటే’ – రామయ్య కొడుకు ముఖంలోకి చూసాడు.

‘రెండేళ్లు ఇక్కడే వుండండి – తరవాత ఆలోచిద్దాం’

సిద్ధూ లోపలకెళ్లిపోయాడు.

తోటకూర రామయ్యకి అర్థమైంది విషయం.

* * * * * *

“ఏం రామయ్యా! ఈ తోటకూర పని మానవా?” మేష్టారు ఆరోజు రామయ్య తట్టతో ఆకుకూరలు సద్దుతుంటే అన్నాడు.

నా కొడుకు ఈ తోటకూర పని మానేసి తనతో పట్నం వచ్చేయమని – నేనేరా నన్నాను’ – రామయ్య ముఖం గంభీరంగా మారింది.

మేష్టారు రామయ్యకేసి చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు.

తోటకూర రామయ్య డబ్బులు కూడబెడుతూనే ఉన్నాడు. సిద్ధూ కొడుక్కి చిన్న గొలుసు చేయించాలిగా మరి!! ఆ రామయ్య ఎప్పటికీ తోటకూర రామయ్యే మరి!!